# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రపంచ స్థాయి సముద్ర సహకారంలో భారతదేశం ముఖ్య పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ రక్షణ, భద్రతా రంగాలను బలోపేతం చేయడంలో భారత్ - న్యూజిలాండ్ దేశాలు కలసి పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- ❖ ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణం, మౌలిక సదుపాయాలు అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ కబడ్డీ ప్రపంచ కప్ 2025 ఈరోజు సాయంత్రం ఇంగ్లాండ్‌లో ఘనంగా ప్రారంభమైంది.

=====================

ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశాలు సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఉమ్మడి విన్యాసాలు చేపడుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో ఇండియన్ నావల్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ సర్వీస్, ఇండియన్ నావల్ ఆర్మమెంట్ సర్వీస్ ట్రైనీ ఆఫీసర్ లతో రాష్ట్రపతి సంభాషిస్తూ... సముద్ర సహకారంలో ప్రపంచ స్థాయిలో భారతదేశం ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న తాజా సాంకేతిక పరిణామాల గురించి అధికారులు తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవాలని ఆమె సూచించారు. దేశ సేవకు, భారత నావికాదళానికి తమను తాము అంకితం చేసుకోవాలని ఆమె అధికారులను సూచిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

=====================

రక్షణ, భద్రతా రంగాలను బలోపేతం చేయడానికి భారత్ - న్యూజిలాండ్ దేశాలు కలసి పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దేశంలో పర్యటిస్తోన్న న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఈరోజు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం, క్రీడలు, అటవీ రంగాలకు సంభందించి ఐదు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఉగ్రవాదం, వేర్పాటు వాదాన్ని అణిచివేసేందుకు భారత్ - న్యూజిలాండ్ దేశాలు కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఆమోదయోగ్యం కాదని నరేంద్రమోదీ అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇరుదేశాలకు ఉపయోగపడే రీతిలో వాణిజ్య సామర్థ్యం పెరుగుతుందని, పాడిపరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరుదేశాలు అభివృద్ధిని కోరుకుంటున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 45 సెకన్లు)

కాగా న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు.

====================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బార్డ్ తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య నిఘా సమాచార పంపిణీ, సాంకేతిక పరిజ్ఞాన సహకారాన్ని పెంపొందించుకోవడం, భారత్ - అమెరికాల ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుగుణంగా భద్రత రంగంలో బంధం బలోపేతంపై ఇరువురు చర్చించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ముఖ్యంగా సముద్ర రంగంలో సాధించిన గణనీయమైన పురోగతిని సమీక్షించారు. పరస్పర వ్యూహాత్మక ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు అత్యాధునిక రక్షణ ఆవిష్కరణలు, ప్రత్యేక సాంకేతికతలలో ఇరు దేశాల మధ్య సహకారం కోసం చర్చించినట్లు వెల్లడించింది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

====================

రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ పనితీరుపై ఈరోజు రాజ్యసభలో జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇస్తూ.. దేశంలో రైలు ప్రమాదాలను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గత 10 సంవత్సరాలలో రైల్వేశాఖలో 5 లక్షల ఉద్యోగాలను కల్పించామని, అలాగే 2020 నుండి ప్రయాణీకుల ఛార్జీలు పెంచలేదని తెలిపారు. రైల్వే ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, ప్రభుత్వం దీనిని మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తోందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన స్టేషన్లలో 60 శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయడం ద్వారా రద్దీ సమయాలలో దాని నిర్వహణ కోసం రైల్వే కృషి చేస్తోందని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 42 సెకన్లు)

====================

కబడ్డీ ప్రపంచ కప్ 2025 ఈరోజు సాయంత్రం ఇంగ్లాండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా వోల్వర్ హాంప్టన్‌లో భారత్, ఇటలీ దేశాల పురుషుల జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో భారత్ 64 - 22 తేడాతో ఇటలీని ఓడించింది. ఈ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పురుషుల జట్టు హంగేరీపై 101 - 25 తేడాతో గెలిచింది. ఏడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలలో 60కి పైగా మ్యాచ్‌లు జరుగనున్నాయి.

=====================

వక్ఫ్ (సవరణ) బిల్లు పేద ముస్లింలకు అనుకూలంగా ఉందని పార్లమెంటు సంయుక్త కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ అన్నారు. ఈ బిల్లుపై అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు నిరసనపై ఆయన న్యూఢిల్లీలో ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... 428 పేజీల నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టామని, వక్ఫ్ బోర్డు అభివృద్ధి కోసం సవరణలు చేశామని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మైనారిటీ వర్గాలలో అసత్య ప్రచారాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ముస్లిం సంస్థలు, ఇతరులతో సంప్రదించిన తరువాతే న్యాయమైన, సమతుల్య చట్టాన్ని రూపొందించడానికి ప్రభుత్వం ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సూచించిందని ఆయన పేర్కొన్నారు.

=====================

యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై అమెరికా ఇప్పటివరకు నిర్వహించిన వైమానిక దాడుల్లో 53 మంది మరణించగా, 101 మంది గాయపడ్డారని హౌతీల ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీరిలో చాలామంది పిల్లలు, మహిళలు ఉన్నట్లు తెలిపింది.  మరోవైపు హౌతీలు ఈరోజు రెండుసార్లు అమెరికా విమాన వాహక నౌకా బృందంపై దాడులు చేసినట్లు వెల్లడించారు. తొలుత మొత్తం  18 క్షిపణులు, డ్రోన్లను యూఎస్ఎస్ హారీ ట్రూమన్, దాని సహాయ నౌకలే లక్ష్యంగా చేసుకొని ప్రయోగించినట్లు చెప్పారు. ఆ తర్వాత కొన్ని గంటలకు మరోవిడత తాము దాడి చేసినట్లు పేర్కొన్నారు. యెమన్‌లు మొత్తం దేశ రక్షణరంగంలోకి దిగాలని హౌతీ నేత అబ్దుల్ మాలిక్ అల్‌హౌతీ పిలుపునిచ్చారు. మరోవైపు ఐక్యా రాజ్యసమితి ఇరుపక్షాలు సైనిక చర్యలను నిలిపివేయాలని కోరింది.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం  73 వేల 828 పాయింట్ల వద్ద సాధారణంగా ప్రారంభమై... చివరికి 341 పాయింట్ల లాభంతో 74 వేల 169 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 111 పాయింట్ల లాభపడి 22 వేల 508 వద్ద స్థిరపడింది. మార్కెట్ ముగిసే సమయానికి డాలరుతో రూపాయి మారకం విలువ 23 పైసలు బలపడి 86.82గా ఉంది.

=====================
=====================